# ఘోరకలి

## పి.వి.డి.యస్. ప్రకాష్

అర్ధ రాత్రయింది.

పెళ్ళివారిల్లులా కోలాహలంగా వుంది - ఆ స్టేషను.

"భిన్నత్వంలో ఏకత్వం" అనిపించక మానదు. ఆ పరిసరాల్ని పరిశీలించిన ఎవరికైనా.

అనేక భాషలు. అనేక కంఠాల ద్వారా విన వస్తున్నాయి కేకలు.

చిన్నపిల్లల ఏడుపులు.

బిగ్గరగా నవ్వులు.

వేటినీ పట్టించుకోకుండా నిర్లిప్తంగా వున్నాడు కృష్ణ. అతని ముఖంలో అనేక భావాలు ప్రతిఫలిస్తున్నాయి. ఒక్క క్షణం పెదవులపై చిరునవ్వు కనిపిస్తుంది.

అంతలోనే-

ఆందోళన, విసుగు, కంగారు త్వర త్వరగా కదలాడిపోతున్నాయి తెరమీద బొమ్మలవలె.

మాటి మాటికి టైం చూసుకొంటున్నాడు. ప్లాటుఫారంపై అటూ ఇటూ తిరుగుతున్నాడు

"ఇంకా రాలేదేం? తనొచ్చే టైం అయింది" స్టేషను బయటి గేటు వేపు దృష్టి సారించాడు.

"ఎందుకు రాలేదు" తర్కించుకొంటున్నాడు తనలోతానే.

"కొంపతీసి వాళ్ళింట్లో తెలిసిపోలేదుకదా?" చిన్నగా వణుకు-అతని వెన్నెముకలోంచి.

"ఛ! ఛ! అది కాదు." చేతిలో వున్న టిక్కెట్లు నవ్వుతున్నాయి కృష్ణని చూసి పలకరింపుగా.

"వాసంతి" ఆ పేరు తలచుకొంటే చాలు ఎదలో పుష్పిస్తున్నాయి ఎన్నో నందనాలు

"ఇంకా గంట టైముంది- ట్రైనొచ్చేందుకు. ఈలోపల వాసంతి వచ్చేస్తుంది" అనుకొన్నాడు కృష్ణ. వాసంతితో పరిచయమై సంవత్సరమే అయింది.

కాని, ఎన్నో జన్మల అనుబంధాన్ని తను తీసుక వచ్చింది. ఎంత విచిత్రంగా ప్రవేశించింది జీవితంలోకి. తలచుకొంటూంటే ఇపుడు జరిగినంత కొత్తగా అనిపిస్తోంది.

అతని మనసు గతంలోకి తొంగిచూసింది.

**కృష్ణ బి.ఏ పాసయి రెండు సంవత్సరాలయింది. కాలేజీలో చదువుకుంటున్నపుడు భవిష్యత్తునుగూర్చి అందమైన కలలు కన్నాడు. సౌందర్య పిపాసి. జర్నలిజం అంటే ఇష్టం. ఒక దినపత్రికలో కరస్పాండెంటు:**

తోచక. చేతిలో బాగ్ బరువుగా తోచిందతనికి.

చిన్నగా నవ్వుకొన్నాడు కృష్ణ.

ఆ నవ్వులో- "అవును! బరువు బాధ్యతలు అపుడే నన్ను వరిస్తున్నాయి" అన్న భావం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"వాసంతి" అతని పెదవులు అస్పష్టంగా కదిలాయి.

* * *

"ఆటోగ్రాఫ్" ఒక చిన్న పుస్తకం అందిస్తూ అడిగింది ఆ అమ్మాయి. ఆమె కళ్ళలో ఏదో మెరుపు. ఎవరో అందుబాటులో లేని గొప్ప వాళ్ళని కలుసుకొంటే కలిగే ఆనందం ఆమెలో ద్యోతకమవుతోంది.

"ఎందుకు" అడిగాడు కృష్ణ.

"మిమ్మల్ని కలుసుకొన్నందుకు జ్ఞాపకంగా" అంది ఆ అమ్మాయి తన్మయంగా.

నవ్వాడు చిన్నగా కృష్ణ.

"నేను కవిని కాను. గాయకున్ని కాను. చిత్రకారుణ్ణి కాను. ప్రెస్ రిపోర్టర్ని. అంతే"

"అయినా సరే" ఆ అమ్మాయి మొండిగా అంది.

ఆ రోజు కాలేజిలో ఫంక్షను. న్యూస్ గేదర్ చేయడం కోసం అక్కడికి వచ్చాడు కృష్ణ. ఫంక్షను అనుకొన్న సమయానికి ప్రారంభం కాలేదు. ఇంతల్లో విద్యార్థినులు కొంతమంది కృష్ణ చుట్టూ గుమికూడారు. ఎంతో కుతూహలంగా వార్తల సేకరణ గురించి పత్రికారంగం గురించి ఎన్నో ప్రశ్నలు వేశారు.

అన్నింటికి విసిగిపోకుండా జవాబిచ్చాడు కృష్ణ. ఈ ఇంటర్వ్యూ కొత్త అనుభవం అతనికి. ఇంతలో ఆ అమ్మాయి అడిగింది- ఆటోగ్రాఫంటూ. విస్మితుడయాడు కృష్ణ.

ఎద లోయలలో ఎక్కడో తెలియని ఆనందం వుబికి వచ్చింది కళ్ళలోకి.

ఆ అమ్మాయి ప్రక్కనున్న స్నేహితురాళ్ళు ప్రోత్సాహించారామెను. ఇక తప్పలేదు కృష్ణకి.

"ఇవ్వండి" అడిగాడు ఆ అమ్మాయి వంక అదోలా చూస్తూ.

"ఆ కళ్ళలో ఏదో ఆకర్షణ వుంది" అనుకొన్నాడు మనసులో.

పుస్తకం చేతిలో పట్టుకొన్నాడు.

కాని, ఏం రాయాలి? ఆలోచిస్తున్నాడు కృష్ణ.

"శుభాభినందనలతో" అని అంతగా నచ్చలేదతనికి. ఆటోగ్రాపులో సంతకం పెట్టడం కూడా ఒక కళే.

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయి" అంటూ సంతకం పెట్టాడు కృష్ణ.

పక్క పేజీ చూపిస్తూ- "మీ చిరునామా" అంది.

ఇచ్చాడు కృష్ణ.

అపుడడిగాడు- "మీ పేరు"

"వాసంతి"

"గుడ్ నేమ్"

* * *

సాయంత్రం అయిదు గంటలయింది.

రద్దీగా వున్న కూడలది. ఒక ప్రక్క థియేటర్-మరో ప్రక్క మార్కెట్ వుంది. నెలలో మొదటివారమది.

ప్రవాహంలా జనం వచ్చేస్తున్నారు. చిరా

కనిపిస్తున్నది ఆ వాతావరణంలో ఒక నిముష ముందే. ఆ రహదారిలోనే వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి.

కృష్ణ ఏదో పనిమీద అక్కడకు వచ్చాడు.

ఇంతలో-

కీచుమంటూ ఆగింది లారీ.


క్షణంలో అక్కడ కలకలం మొదలయింది. హాహాకారాలు మిన్నుముడుతున్నాయి. ఆర్త నాదాలు గుండెల్ని చీలుస్తున్నాయి.

ఏం జరిగిందోనని ఆత్రుతగా జనం గుమికూడారు. కృష్ణకూడ పరుగుపరుగున అక్కడికి చేరుకున్నాడు.

అంతే-

అతను దృశ్యాన్ని చూడలేకపోయాడు.

లారీతో స్కూటరు ఢీకొంది. స్కూటరు



మీద వున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. స్కూటరు పూర్తిగా పాడయిపోయింది.

ఆ ప్రదేశమంతా రక్తంతో ఎర్రబడి వుంది.

స్థాణువులా నిల్చున్నాడు కృష్ణ.

"ఎలా జరిగింది" అందులో ఒకడడుగుతున్నాడు-మరొకడివి.

"తాగేసి నడుపుతారు లారీలను. అందుకే ఈ ప్రమాదాలు"

"స్కూటర్ నడుపుతూం పేవాలి. ఓకళ్ళాపై తెలీదు" రకరకాల వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి.

"ఓర్నాయనో! ఎంత పని చేశావురో కొడుకో" ఏడుస్తూ వచ్చిందొకామె. చని పోయిన వారి బంధువు కాబోలు. గుండెలమీద బాదుకొంటోంది ఆవేశం ఆపుకోలేక. ఆవిడ లారీ డ్రైవర్నికూడా ఇష్టమొచ్చినట్లు తిడు తోంది. లారీ డ్రైవరు బెదురు బెదురుగా చూస్తున్నాడందరి వంకా. సర్వ సాధారణంగా ప్రమాదం జరిగిన వెంటనే జనం కోపంతో రెచ్చిపోతారు. ఆ పరిస్థితిని ఎదుర్కోలేక పారి పోతారు డ్రైవర్లు.

పోలీసులు రంగంలోకి దిగారు.

నెమ్మదిగా కర్తవ్యం గుర్తొచ్చింది కృష్ణకి.

చేతిలోని నోట్ బుక్ తెరచి వివరాలు రాయ సాగాడు.

* * *

కృష్ణ కళ్ళముందు ఆ సంఘటనే మెదులు తోంది. ఎర్రటి రక్తంతో ఆ ప్రదేశం ఎర్రగా మారుతూ.

ఒళ్ళు జలదరించింది.

వెంటనే కాలేజీ ఫంక్షను కూడా గుర్తొ చ్చింది.

ఆ సమయంలో నెమ్మదిగా కళ్ళెత్తి "ఆటో గ్రాఫ్" అన్న వాసంతి గుర్తొచ్చింది.

కృష్ణ మనసు ఈ రెండు దృశ్యాలను త్రాసులోవేసి బరువు తూస్తోంది.

అసలే కృష్ణది చాలా సున్నితమైన మనసు. ఏ చిన్న బాధ ఎవరికి కలిగినా భరించలేడు.

వాసంతి కళ్ళలో మెరుపునుచూసి అను కొన్నాడు కృష్ణ. నిజంగా తను గొప్పవాడని.

కాని, ఈ ఇద్దరి చావుల్ని ఇంత దగ్గరగా చూసిన తరువాత అతనికి జీవితంమీద విరక్తి కలుగసాగింది.

మిధ్యా గౌరవాలకోసం ప్రాకులాడే వ్యక్తుల మీద అసహ్యం లాంటి భావం ఏర్పడసాగింది.

కృష్ణ బి.ఏ. పాసయి రెండు సంవత్సరా లయింది. కాలేజీలో చదువుకొంటున్నపుడు భవిష్యత్తునుగూర్చి అందమైన కలలు కన్నాడు. స్వతహాగా సౌందర్య పిపాసి. జర్నలిజం అంటే ఇష్టం. ఒక దిన పత్రికద్వారా న్యూస్ కరస్పాండెంటుగా నియమితుడయాడు కృష్ణ. కృష్ణ తండ్రికి ఈ పద్ధతి నచ్చలేదు. హాయిగా వున్న వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోమంటాడు. కృష్ణకదినచ్చదు. తండ్రి నెదిరించలేక షాపులో ఒక గంట కూర్చుంటూ వుంటాడు.

గబగబా బట్టలు మార్చుకొని వీధిలోకి నడి చాడు కృష్ణ. పార్కులవేపు. థియేటర్ల వేపు వెళుతున్న జంటల్నిచూసి అతని మనసు బాధగా మూలిగింది.

గంట క్రితం జరిగిన ప్రమాదం ఎవరిమీద ఏ మాత్రం ప్రభావం కూడ చూపించలేదు.

ఇద్దరు వ్యక్తులు ఈ లోకంనుండి నిష్క్ర మిస్తూ మూలిగిన మూలుగుకి అర్థం ఎవరూ వెదుక్కోవడంలేదు.

ఆలోచిస్తున్న కొద్దీ పిచ్చెక్కిపోతున్నట్లని పించింది కృష్ణకి.

ఆ క్షణంలో అతనికి తోడు కావాలని పించింది. తన మనసులోని బరువుని దించు కోవడానికి. తనని ఓదార్చడానికి ఓ వ్యక్తి కావా లనిపించింది.

వెళ్ళి బీచిలో కూర్చున్నాడు కృష్ణ-ఎగిరి పడుతున్న కెరటాలవంక అదే పనిగ చూస్తూ "నమస్తే సార్" శ్రావ్యమైన కంఠధ్వని విని పించింది.

పక్కకి తిరిగి చూసాడు కృష్ణ.

వాసంతి!



ఎందుకు ?

"వరదబాధితులకు డబ్బు ఎందుకు పంచుతారు?" అడిగాడు ను. వాసుని

"ఆహారపదార్థాలు అక్కడే నిల్వ ఉండవు గనక...." చెప్పాడు వాసు.

—కె. లక్ష్మణ్ ప్రసాద్ (విశాఖపట్నం)

"రండి! కూర్చోండి" ఆహ్వానించాడు కృష్ణ. అతని ప్రక్కనే నాలుగడుగుల దూరంలో కూర్చుంది వాసంతి. ఆమె నుదుటిమీద అల్లరిగా కదులుతున్న ముంగురుల్నిచూస్తూ అలాగే వుండిపోయాడు కృష్ణ.

"చెప్పండి" అంది వాసంతి.

వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు కృష్ణ.

అపుడను కొన్నాడతను- "ప్రకృతిలో ఆక ర్షణ వుంది. అది జీవితాన్ని చిగురింపజేస్తుంది. బ్రతుకులోని మాధుర్యాన్ని చవి చూపిస్తుంది. అందుకే లోకంలో ఎంతమందిపోతున్నా మిగి లిన వారు జీవితాన్ని అనుభవించగలుగు తున్నారు.

* * *

"నిన్న సత్యా థియేటర్లో మిమ్మల్ని చూసాను" అన్నాడు కృష్ణ. ఆ సాయంత్రం వాసంతిని కలసినపుడు. వారిద్దరూ ఇంచుమించు ప్రతిరోజూ కలుస్తున్నారు.

గంటలకొద్దీ మాట్లాడుతున్నారు-బీచి చల్ల గాలిని అనుభవిస్తూ, "బాపురే" గుండెల మీద చెయ్యి వేసుకొంది వాసంతి, కళ్ళు పెద్దవిచేస్తూ

"ఏం" అడిగాడు వాసంతినే-తమకంగ తిలకిస్తూ.


"దయచేసి మీరు నావెంట బడొద్దుబాబూ" అంది బ్రతిమాలుతూ.

"ఏం"

"ప్రెస్ రిపోర్టర్ల దృష్టిలో పడడం ఆడ దానిగా నాకు మంచిదికాదు"

"అంటే"

"నవ్వుతూ అంది వాసంతి-" రంగు కళ్ళద్దాలతో అన్ని వృత్తులను పోల్చలేనుగాని కొన్ని వృత్తులు అంతే. జీవితంలో ఒక





తేడా ?

"అమ్మా.... మమ్మీ .. అన్న పిలుపు లకి తేడా ఏమిటి" అడిగాడు గోపాలం, సుబ్బారావుని

"చీరకు, గౌనుకు వున్నంత తేడా వుంది...." చెప్పాడు సుబ్బారావు

—కె లక్ష్మణ్ ప్రసాద్ (పిఠాపురం)

భాగమైపోతాయి. ఉదాహరణకు డాక్టర్లు, పోలీసులు పరిచితమైన ప్రతి ఒక్కరినీ అనుమాన దృష్టితో శల్య పరీక్షచేస్తూనే వుంటారు. రోగి అవకపోడా, నేరస్థుడయినా కాకపోతాడా అని. మరేం అనుకోకండి. నే చెప్పింది తప్పే కావచ్చు. సరదాగా అన్నాను"

నవ్వాడు కృష్ణ-"అలాగే నన్నూ అంటారు మీరు. కాని, ఒక హామీ ఇస్తున్నాను-ఫ్రెండు కనుక. మీరెంత అల్లరిచేసినా పేపరెక్కించను లెండి"

ఇద్దరూ నవ్వుకొన్నారు కిలకిలా.

ఉన్నట్టుండి అంది వాసంతి- "రేపు నాకు పెళ్ళి చూపులు"

ఆ మాట వినగానే కృష్ణ ముఖం జీవు రించింది. అతని కళ్ళలో ఏదో భావం లీలగా కదలడం వాసంతి దృష్టిని దాటిపోలేదు.

"మీరు పెళ్ళి చేసుకొంటారా?" అడిగాడు కృష్ణ. తన గొంతు తనకే కొత్తగా వినిపించింది కృష్ణకి.

"చేసుకోకూడదా" అడిగింది వాసంతి.

"అది కాదు నా ప్రశ్న" తడబడ్డాడు కృష్ణ. ఏదో చెప్పాలనిపించిందతనికి కాని చెప్పలేక పోయాడు.

ఆ తరువాత కూర్చున్న అరగంటలోనూ ఆరేడు మాటలు మాత్రమే నడిచాయి వారిద్దరి మధ్య.

* * *

వాసంతిని ప్రేమిస్తున్నానా?" ప్రశ్నించు కొన్నాడు కృష్ణ తనలోతానే. అవును-కాదు. ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు.

"రేపు నా పెళ్ళి చూపులు" అన్న వాసంతి మాటలు విన్నపుడు తనెందుకలా అయి పోయాడు. మామూలుగా ఎందుకుండలేక పోయాడు.

ఆలోచిస్తున్నాడు దీర్ఘంగా.

"ఇది ఆకర్షణ కాదు కదా?" అనుకొన్నాడు మళ్ళీ.

"కాదు-కాదు" జవాబు చెప్పింది మనసు.

"వాసంతి లేకుండా తను బ్రతుకలేడా?"

"లేడు""

"అయితే, వాసంతి నన్ను ప్రేమిస్తోందా?"

మళ్ళీ ప్రశ్న తిన స్వరూపాన్ని మార్చు కొంది.

ఈ సంవత్సర కాలంలో వాసంతి తనూ కలిసి తిరిగారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకొన్నారు. ఒకరి ఇష్టాలు ఒకరు వ్యక్త పరుచుకొన్నారు.

ఇంత దగ్గరగా పరిచితమైన వ్యక్తి జీవి తంలోకి ప్రవేశిస్తే 'ఏవో తీయని వూహలు.

"అవి కల్లలు కాకుండా చెయ్యి భగవాన్" మనసులోనే మ్రొక్కుకొన్నాడు.

"ఈ రోజెలాగయినా వాసంతితో మాట్లాడాలి" అనుకొన్నాడు కృష్ణ. అద్దం ముందు కూర్చుని తల దువ్వుకొంటూ టేబుల్ మీద ఫొటోస్టాండ్‌లోని ఫొటో తనని చూసి నవ్వినట్లనిపించింది. ఆ ప్రక్కని వాసంతిని వూహించుకొంటున్నాడు.

బీచిలో కూర్చున్నాడు కృష్ణ. దూరంగా నింగీ, సంద్రం ఒకదాని కౌగిట్లో ఒకటి ఒదిగున్నాయి.

కృష్ణ కళ్ళు కొత్త కోణంలోనుంచి చూస్తున్నాయి ప్రతి విషయాన్ని. ఇద్దరు దంపతులు కృష్ణకి కొద్ది దూరంలో కూర్చున్నారు. ఆవిడ ఒడిలో పాప నవ్వుతూ కేరింతలు కొడుతోంది. ఆంగ్లో. ఇండియన్స్ కాబోలు. ఆవిడ గౌను ధరించింది.

ఇద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసు కొంటూ ఈ ప్రపంచాన్ని మరిచిపోతున్నారు.

ఇంతలో పాప కెవ్వుమండి. ప్రక్కనే వున్న బాగ్‌లోంచి ప్లాస్కు తీసి పారెక్స్ కాబోలు పడుతున్నారు పాపకి.

వూహించుకొంటున్నాడు కృష్ణ వాసంతిని డ్రెస్‌లో. అతని ముఖంలో వికారం చోటు చేసుకొంటోంది.

"వాసంతి చీరలోనే బాగుంటుంది. నడుస్తుంటే నడుందగ్గర పడుతున్న మడతా ఇంకా బాగుంటుంది. ముడతలు పడ్డ చీరకుచ్చిళ్లు ఇంకా బాగుంటాయి" అనుకొన్నాడు కృష్ణ.

వాసంతి రాలేదు.

అపుడు గుర్తు వచ్చిందతనికి.

ఇవాళ రాదని-పెళ్ళి చూపులని.

* * *

"నాకీ పెళ్ళి ఇష్టం లేదమ్మా" వాసంతి అంది తల్లితో. విస్మయంగా చూస్తోంది రాంబాయమ్మ.


"ఏం ? ఎందుకిష్టం లేదు" విసురుగా వాళ్ళ సంభాషణలో కలుగజేసుకొన్నాడు రంగనాథం గారు.

"నాకతను నచ్చలేదు" అంది వాసంతి.

ఆమె వూహల్లో కృష్ణ మెదిలాడు.

"వెరీ స్మార్ట్" అనుకొంది మత్తుగా.

"పిల్లవాడికేం లక్షణంగా వున్నాడు. మహారాజులా వుద్యోగం చేసుకొంటున్నాడు. ఇంతోటి సంబంధం మళ్ళీ కుదురుతుందా ?"



ఆడపిల్ల తండ్రి ఆవేదనుంది రంగనాధంగారి మాటలలో.

"చూడమ్మా! ఇంతకంటే మంచి సంబంధం మనకిరాదు. ఆడపిల్లలకు ఇష్టాయిష్టాలుండకూడదమ్మా. మగవాడు నచ్చింది అన్నాడు. అదే మహాద్భాగ్యమనుకోవాలి" అంది రాంబాయమ్మ నచ్చ చెబుతున్న ధోరణిలో.

కూతురి మాటలతో పంతం సడలలేదు.

వూహిస్తోంది రాంబాయమ్మ తనకూ తన కూతురికిగల వ్యత్యాసం.

అది ముందు తరం.

అందుకే భావాలలోకూడా ముందే.

"ఎవరడ్డు వస్తారో చూస్తాను. ఈ పెళ్ళి నిశ్చయమైపోయినట్లే. జరిగి తీరుతుంది" ఆవేశంగా రంగనాధంగారన్నారు. వాసంతి విసురుగా అయిష్టతను వ్యక్తంచేస్తూ వెళ్ళిపోయింది.

*   *   *

"కృష్ణా"

"వాసూ"

మెత్తగా హత్తుకొన్నాడు గుండెల దగ్గరికి కృష్ణ. గువ్వలా ఒదిగిపోయింది వాసంతి.

కృష్ణ చేతులు నిమురుతున్నాయి వాసంతి వీపుని నేనున్నానంటూ ధైర్యం చెబుతూ.

వాసంతి హృదయం తేలిక పడినట్లయింది. మీద పడబోతున్న సమస్య నెమ్మదిగా జరిగి ప్రక్కకి ఒరిగిపోయినట్లయింది.

"కృష్ణ చెబుతున్నాడు "వాసూ నాదగ్గర కొంత డబ్బుంది. రేపు రాత్రి ట్రైనుకి బయలుదేరుదాం. తిరుపతిలో పెళ్ళి చేసుకొందాం. తిరిగి వద్దాం. మనవాళ్ళ ఆశీస్సులు తీసుకొందాం"

ప్లాన్ నచ్చింది వాసంతికి.

అలాగే అన్నట్లు తలూపింది.

*   *   *

దూరంగా చుక్కలా కనిపిస్తున్న ఇంజను దగ్గరయి, మరీ దగ్గరయి తన రాక్షస స్వరూపాన్ని చూపిస్తూ భీకరంగా అరచి ప్లాట్ ఫారంమీద ఆగింది.

కృష్ణ వులిక్కిపడ్డాడు.

అవును. ఈ ట్రైన్‌లోనే తనూ వాసంతి వెళ్ళాల్సింది.

"ఎందుకు రాలేదు" మనసులో బాధ.

"ఇక్కడ ట్రైను పది నిముషాలు ఆగుతుంది. ఈ లోపల రాకుండా పోతుందా?" ఆశగా గేటుకేసి చూస్తున్నాడు కృష్ణ.

అతని కళ్ళముందు ఎన్నో దృశ్యాలు మెదులుతున్నాయి. ఎన్నో ఆలోచనలు అతన్ని రాక్షసునిగా చేస్తున్నాయి. స్థిమితంగా వుండలేక పోతున్నాడు.

"ఏమిటిలా జరిగింది. వాసంతి ఎందుకిలా మోసగించింది. తనని ఆట పట్టించిందేమో. అభిమానించలేదేమో"

అనేకవిధాలుగా ఆలోచిస్తున్నాడు. అతని మనసుని అదుపులో పెట్టలేకపోతున్నాడు.

"వాసంతిని అనుమానించడం తన అల్పత్వానికి చిహ్నమేమో?" మరుక్షణంలో బాధ పడ్డాడు.

గార్డువిజిల్ వినిపించింది.

ట్రైను తనమీదినుంచే వెళ్ళిపోతున్నట్లు బాధపడ్డాడు.

"కృష్ణా!" అంటూ వచ్చింది వాసంతి.

ఆమె అలసిపోయినట్లు కనిపించింది. తూలుతోంది నీరసంగా. జాకెట్టు, చీర అక్కడక్కడా చిరిగున్నాయి.

ఆమెనలాగే చూస్తున్నాడు కృష్ణ.

"ఏమిటి? ఏమయింది" అడుగుతున్నాడు ఆర్తిగా. ఆమెను దగ్గరగా— హృదయానికి దగ్గరగా తీసుకొన్నాడు.

వాసంతికి సాంత్వన లభించినట్లయింది ఒక్క క్షణం. ఆ తరువాత—

వాన వాగై వరదైనట్లు కన్నీరుబికింది.

"కృష్ణా!" ఆమె పెదవులు అదురుతున్నాయి. ఏదో చెప్పాలని ఆవేశం ఆత్రుత.

అయినా, చెప్పలేని స్థితి.

నిజంగా నరకం

కృష్ణ-ఆమెవంక చూస్తున్నాడు పిచ్చివాడిలా

*   *   *

"తాగిన మైకంలో కన్నకూతురి హత్య-కంట్రాక్టర్ అరెస్ట్"

"నేటి కుళాయి తగాదా-ఒకని మృతి"

"రోడ్డు ప్రమాదం-ఒక వ్యక్తికి స్వల్పంగా గాయాలు"

ఇవీ వార్తలు-ఇదీ ప్రపంచం.

విరక్తిగా నవ్వుకొన్నాడు కృష్ణ

"అభివృద్ధి చెందుతోంది ఈ దేశం. ప్రగతి పథాన పయనిస్తోంది"

ఈ అక్షరాలు అతని కళ్ళముందు నగ్నంగా నాట్యం చేస్తున్నాయి. అతనిలో ఏదో నిర్లిప్తత చోటు చేసుకొంది.

టేబుల్‌మీద కూర్చుని దీక్షగా రాస్తున్నారు కృష్ణ.

"స్థానిక కాలేజిలో బి. ఏ రెండవ సంవత్సరం చదువుతున్న వాసంతిని ఈ నెల పన్నెండున ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మానభంగం చేసారు. అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకొంది"

అంతే-

అతని కలం ముందుకు సాగలేదు.

కన్నీరు స్రవిస్తోంది ధారాపాతంగా.

పోస్టు బాక్సులో ఉత్తరం పడేస్తూ అనుకొన్నాడు కృష్ణ.

"ఈ నడుస్తున్న చరిత్రకు నేను భాష్యం చెప్పలేను. ఈ సంఘటనలకు సాక్షిగా నిలబడలేను.

రాక్షసత్వం నిండిన ఈ రంగస్థలి తెర నే లాగలేను అవును.

నేను మానవుణ్ణి.

ఈ దారుణాల్ని సహించి తట్టుకొనే గుండె ధైర్యం లేదు. ఆ సమయంలో అతనికి గుర్తొచ్చాయి, ఒకనాడు వాసంతితో అన్న మాటలు-

"ఒక హామీ ఇస్తున్నాను- ఫ్రెండు కనుక. మీరెంత అల్లరి చేసినా పేపరెక్కించనులెండి"

అంతే- నెమ్మదిగా ఒరిగిపోతున్నాడు కృష్ణ నేల మీదికి. ✱



## ఉచితం

ఓ ప్రకటన ఇలా వుంది.

'రెండు వందల పేజీల వ్యాకరణం పుస్తకం కొంటే మీకు విలువైన మూడు వందల పేజీల పుస్తకం ఉచితం.'

ఆ వ్యాకరణం పుస్తకం కోసం ఎన్నో ఆర్డర్లు వచ్చాయి.

ఆ పుస్తకం తెప్పించి పాక్ విప్పిన వారందరికీ ఆ వ్యాకరణ పుస్తకంలోని తప్పొప్పుల గురించి, సవరణల గురించే పుస్తకం వుంది.

—ఎస్. దామోదర్ (కరీంనగర్)